

బెట్టింగ్‌కు పాల్పడితే చర్యలు

కికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ అన్నారు. ప్రొద్దుటూరులోని 36 మంది క్రికెట్ బుకీలను ఎస్పీ ఎదుట హాజరు పరిచారు. -8లో



రెచ్చిపోతున్న మట్టి మాఫియా

అన్నమయ్య జిల్లాలో మట్టి మాఫియా ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. రిజర్వ్ ఫారెస్ట్‌తోపాటు ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా తవ్వకాలు జరుపుతున్నారు. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.6/25.2

జిల్లాలో ఆదివారం 25.2 – 36.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 7.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

– కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

14న ఖోఖో జట్టు ఎంపిక

కడప ఎడ్యుకేషన్: వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల ఖోఖో సంఘం ఆధ్వర్యంలో యోగివేమన విశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో ఈ నెల 14వ తేదీ ఉదయం 8 గంటలకు జిల్లాస్థాయి ఖో ఖో జూనియర్ జట్టు ఎంపికలు జరగనున్నాయి. ఈ విషయాన్ని జిల్లా ఖోఖో సంఘం అధ్యక్షుడు డాక్టర్ రామసుబ్బారెడ్డి, కార్యదర్శి నరేంద్ర తెలిపారు. ఎంపికల్లో పాల్గొనదలచిన బాలబాలికలు 2006 జనవరి 1వ తేదీ తర్వాత పుట్టి ఉండాలన్నారు. క్రీడాకారులు ఎత్తు, బరువు, వయసు మూడు కలిపితే 250 పాయింట్లలోపు ఉండాలని సూచించారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే వారు ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు చిత్తూరుజిల్లా యాదమర్రిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 9849713690 నంబర్‌లో సంప్రదించాలని వారు తెలిపారు.

10న ప్రత్యేక విద్యుత్ అదాలత్



మాట్లాడుతున్న నరసింహ ప్రసాద్

కడప కార్పొరేషన్: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 10వ తేదీ నిర్వహించే 'ప్రత్యేక విద్యుత్ అదాలత్'ను సద్వినియోగం చేసుకోవాలని కడప విద్యుత్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎల్. నరసింహ ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం స్థానిక విద్యుత్ భవన్ కాన్ఫరెన్స్ హాలులో ఉదయం 11.30 గంటల నుంచి 1.30 గంటల వరకు కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెసల్ ఫోరం(సీజీఆర్ఎఫ్) ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. రిటైర్డ్ జడ్జి వి. శ్రీనివాస ఆంజనేయమూర్తి, సభ్యులు కె. రామమోహన్‌రావు, ఎల్.ఎస్ అంజనీ కుమార్, జి. ఈశ్వరమ్మ హాజరవుతున్నారన్నారు. కడప నగరంలోని టౌన్-2, సబ్ డివిజన్ పరిధిలోని ఎన్జీవో కాలనీ, ఈస్ట్ సెక్షన్, నార్త్ సెక్షన్ విద్యుత్ కార్యాలయాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను రాత పూర్వకంగా తెలపాలని కోరారు.


నేటినుంచి ఇంటర్ మార్కుల మెమోల అందజేత



ఆర్ఐవో కార్యాలయానికి చేరిన మార్కుల మెమోలను పరిశీలిస్తున్న ఆర్ఐవో రమణరాజు

కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్‌కు సంబంధించిన మార్కుల మెమోలు పంపిణీకి కళాశాలల్లో సిద్ధంగా ఉన్నాయి. వీటిని ఆదివారం ఆర్ఐవో రమణరాజు ఆధ్వర్యంలో కడప ఆర్ఐవో కార్యాలయం నుంచి జిల్లాలోని అన్ని కళాశాలకు తరలించి ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లకు అప్పగించారు. విద్యార్థులు తమకు సంబంధించిన కళాశాలకు సోమ, మంగళవారాల్లో వెళ్లి మార్కుల మెమోలను తీసుకోవాలని ఆర్ఐవో రమణరాజు తెలిపారు.

ఆర్చరీ జట్ల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

కడప ఎడ్యుకేషన్: ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు జరిగే ఆర్చరీ జూనియర్, సీనియర్ అసోసియేషన్ మీట్ కోసం జిల్లాస్థాయి ఆర్చరీ ఎంపికలు ఆదివారం డాక్టర్ వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగాయి. ఈ విషయాన్ని జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ప్రెసిడెంట్ జనార్దన్‌రెడ్డి, సెక్రటరీ రాజవీటి తేజేంద్ర తెలిపారు. ఆర్చరీ కోచ్ రాజు ఆధ్వర్యంలో ఎంపికలు జరిగాయని చెప్పారు.
ఎంపికైన వారు: జూనియర్ బాలురు,సీనియర్ మెన్ విభాగాల్లో యశ్వంత్‌రెడ్డి,శ్రీనివాసులు,శ్రీకాంత్, దినేష్‌కుమార్, కుశాల్, శశివర్ధన్, జూనియర్ బాలికల, సీనియర్ ఉమెన్స్ విభాగంలో శివదుర్గ,సుశ్వత ఎంపికయ్యారు.
- రికర్వ్ జూనియర్ బాలుర విభాగంలో ఇంద్ర కళ్యాణ్‌రెడ్డి, భాస్కర్, నవనీష్, సీనియర్ మెన్ విభాగంలో ఇంద్ర కళ్యాణ్‌రెడ్డి, భాస్కర్, నవనీష్‌లు ఎంపికైనట్లు తెలిపారు.

కల్తీ ఆహారాల విక్రయదారులకు జరిమానా

రాయచోటి: అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో నాసిరకం ఆహారపదార్థాల విక్రయదారులపై జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ రూ. 65 వేలు జరిమానా విధించారు. ఆదివారం జిల్లా ఆహార భద్రతాధికారి షమీమ్ బాషా ఓ ప్రకటలో ఈ విషయాన్ని తెలియజేశారు. నాసిరకం ఆహార పదార్థాలను ప్రజలకు అమ్మిన నేరానికి ఏడుగురు హోటల్, సూపర్ మార్కెట్, మినరల్ వాటర్ ప్లాంట్ యజమానులకు జరిమానాను విధించినట్లు తెలిపారు.

సాహో..యువ సైనికా..!

జాతీయస్థాయిలో 17 ఎన్‌సీసీ డైరెక్టరేట్స్ నుంచి దాదాపు 1500 మంది పాల్గొనే ఆలిండియా తల్‌సైనిక్ క్యాంపు–2023లో జిల్లాకు చెందిన నలుగురు ఎన్‌సీసీ కేడెట్స్ పాల్గొని సత్తా చాటారు. ఎన్‌సీసీలో ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే ఈ క్యాంపులో పాల్గొనేందుకు ఎన్నో ఆటంకాలను అధిగమించి అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్న లక్ష్యసాధకులపై కథనం..

- ఆలిండియా తల్‌సైనిక్ క్యాంపులో రాణించిన జిల్లావాసులు
- ప్రతిష్టాత్మక క్యాంపులో పతకాలు



తల్‌సైనిక్ క్యాంపులో శిక్షణలో కేడెట్స్ (ఫైల్)

వైవీయూ: నేషనల్ కేడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ)లో ప్రతిష్టాత్మకంగా భావించే ఆలిండియా తల్‌సైనిక్ క్యాంపులో జిల్లాకు చెందిన ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు పాల్గొని సత్తాచాటారు. కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన టి. రూప, రంగ శివజ్యోతి, కడప ప్రభుత్వ పురుషుల కళాశాల నుంచి ఉస్మాన్ బాషా, సంతోష్‌కుమార్‌లు జిల్లా ఖ్యాతిని జాతీయ స్థాయిలో చాటి చెప్పారు. సెప్టెంబర్ 19 నుంచి 28వ తేదీ వరకు న్యూఢిల్లీలో నిర్వహించిన ఈ క్యాంపులో వీరు పాల్గొని ప్రతిభ కనబరిచారు. వీరంతా పేద, మధ్యతరగతికి చెందిన ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులే కావడం విశేషం. ఎన్‌సీసీ కేడెట్స్ ప్రతిభ పట్ల ఎన్‌సీసీ అధికారులు లెఫ్టినెంట్ డా. ఆర్. నీలయ్య, విస్నీతేజ అభినందనలు తెలిపారు.

తల్‌సైనిక్ క్యాంపు ప్రత్యేకత ఏంటంటే..



దేశవ్యాప్తంగా 17 ఎన్‌సీసీ డైరెక్టరేట్‌ల నుంచి పలుదశల్లో వడపోత అనంతరం మెరికల్లాంటి 1500 మంది ఎన్‌సీసీ కేడెట్స్‌ను ఈ క్యాంపునకు ఎంపిక చేస్తారు. 12 రోజుల పాటు ఢిల్లీలో నిర్వహించే ఆలిండియా ఈ క్యాంపులో ఎన్‌సీసీ కేడెట్స్‌కు రైఫిల్ షూటింగ్, ఆబ్‌స్టికల్ ట్రైనింగ్, మ్యాప్ రీడింగ్‌లతో పాటు ఆర్మీస్థాయిలో ప్రొఫెషనల్ ట్రైనింగ్ నిర్వహించి పోటీలు నిర్వహిస్తారు. నాయకత్వ లక్షణాల పరిశీలన, కేడెట్స్ క్రమశిక్షణ, ప్రవర్తన, ధైర్యం, జాతీయ సమైక్యత తదితర అంశాలన్నింటినీ పరిగణలోకి తీసుకుని ఈ క్యాంపులో ప్రవేశం కల్పిస్తారు. దేశానికి నాయకత్వ లక్షణాలు గల పౌరులుగా తీర్చిదిద్దేందుకు, నరనరాన జాతీయ సమైక్యతను నింపి దేశభక్తిని పెంపొందించేలా శిక్షణ ఉంటుంది.

అమ్మ ఆశయం కోసం..



మాది పెద్దముడియం మండలం భీమగూడెం గ్రామం. అమ్మ కాలం చేశారు. మంచి ఉద్యోగం చేయాలన్న అమ్మ ఆశయం కోసం నాన్న బాలరంగయ్య ప్రోత్సాహంతో కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్‌ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఏ హెచ్ఈపీ చేరాను. కళాశాలలో చేరిన తర్వాత అధ్యాపకుల ప్రోత్సాహంతో ఎన్‌సీసీలో చేరాను. తల్‌సైనిక్ క్యాంపు కష్టంగా ఉంటుంది. అయినా ఇష్టంగా క్యాంపును పూర్తి చేశాను.

– ఎస్. రంగశివజ్యోతి, ఎన్‌సీసీ కేడెట్, ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ కళాశాల, కడప

రైతుబిడ్డగా సంతోషంగా ఉంది..



దేశానికి రైతు, సైనికులు ఎంతో కీలకం. అలాంటి ఆర్మీ విభాగమైన ఎన్‌సీసీలో చేరడం సంతోషంగా ఉంది. మాది కాశినాయన మండలం ఆకులనారాయణపల్లి గ్రామం. అమ్మ మరియమ్మ, నాన్న రామలక్ష్మయ్య (రైతు)ల ప్రోత్సాహంతో కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో బీకాం చదువుతున్నాను. ఎన్‌సీసీలో చేరిన తర్వాత రిపబ్లిక్ డే పరేడ్, తల్‌సైనిక్ క్యాంపుల ప్రాధాన్యత తెలుసుకుని ప్రయత్నించాను. జడ్జింగ్ డిస్టెన్స్ అండ్ ఫీల్డ్ సిగ్నల్స్ విభాగంలో ఆలిండియా తల్‌సైనిక్ క్యాంపునకు ఎంపికై పాల్గొన్నాను.

– టి. రూప, ఎన్‌సీసీ కేడెట్, ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, కడప

స్వర్ణపతకం సాధించాను..



మాది చింతకొమ్మదిన్నె మండలం ఊటుకూరు గ్రామం. నాకు ఎన్‌సీసీ అంటే ఎంతో ఇష్టం. అందుకే కడప ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ బీఎస్సీ (ఎంపీసీఎస్) చేరి ఎన్‌సీసీలో చేరాను. ఇప్పటి వరకు చాలా క్యాంపులు చేసినప్పటికీ ప్రతిష్టాత్మక క్యాంపు తల్‌సైనిక్‌లో పాల్గొనే అవకాశం లభించడం సంతోషంగా ఉంది. జడ్జింగ్ డిస్టెన్స్ అండ్ ఫీల్డ్ సిగ్నల్స్ విభాగంలో స్వర్ణపతకం సాధించడం సంతోషంగా ఉంది. దేశానికి సేవచేయాలన్నదే నా లక్ష్యం.

– ఉస్మాన్‌బాషా, ఎన్‌సీసీ కేడెట్, ప్రభుత్వ పురుషుల కళాశాల, కడప

దేశానికి సేవలందించడమే లక్ష్యం



మాది మైదుకూరు మండలం సరస్వతీపేట. కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో ద్వితీయ బీకాం (సీఏ) చదువుతున్నాను. సీఏటీసీ క్యాంపుల్లో పాల్గొన్నా. దేశవ్యాప్తంగా దాదాపు 900 మంది పురుష కేడెట్స్ పాల్గొన్న కాంపిటీషన్‌లో టెంట్ పించింగ్‌లో రజత పతకం సాధించాను. ఆర్మీ ద్వారా దేశానికి సేవలందించాలన్నదే నా లక్ష్యం.

– జి. సంతోష్‌కుమార్, ఎన్‌సీసీ కేడెట్, ప్రభుత్వ పురుషుల కళాశాల, కడప

మమ అనిపించారు!

- సొసైటీ సమావేశానికి 25 మందే హాజరు
- కోర్టు కేసులు, వివిధ అంశాలపై చర్చ



సమావేశం నిర్వహిస్తున్న రాజేంద్రప్రసాద్‌రెడ్డి

బి.కొత్తకోట: హార్సిలీహిల్స్ కో–ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ సాధారణ సమావేశాన్ని మమ అనిపించారు. హాజరుకావాలని సంఘ కార్యదర్శి సభ్యులకు సమాచారం పంపినా ఐదుశాతం మంది కూడా హాజరుకాలేదు. గతనెల 30న హార్సిలీహిల్స్‌పై ఈ సమావేశం నిర్వహించేందుకు నిర్ణయించగా ఐదుగురు సభ్యులే హాజరు కావడంతో వాయిదా వేసి ఆదివారం మదనపల్లెలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి సమావేశ హాలులో జరిపారు. చైర్మన్ సోమశేఖర్‌రెడ్డి హాజరుకాకపోవడంతో కార్యదర్శి రాజేంద్రప్రసాద్ రెడ్డి సమావేశాన్ని నిర్వహించారు. 25 మంది సభ్యులు హాజరయ్యారు. 500 మందికిపైగా సభ్యులున్నప్పటికీ హాజరుకాలేదు. దీంతో హాజరైన వారితో సమావేశం నిర్వహించి ముగించారు. ఈ సమావేశంలో హార్సిలీహిల్స్‌పై సొసైటికి చెందిన అత్యంత విలువైన సొసైటీ భూమికి సంబంధించి కోర్టుల్లో నడుస్తున్న కేసులపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని, కేసుల పరిష్కారంతో వివాదాలకు తెరపడుతుందని చర్చించారు.ఇప్పటికే రిజిస్టర్ అయిన ప్లాట్లకు సంబంధించి టౌన్‌షిప్ కమిటీ చైర్మన్ అయిన మదనపల్లె ఆర్డీఓ నిర్మాణ ప్లాన్లను అందజేసి అనుమతులు పొందాలని నిర్ణయించారు. ప్లాన్లకు అనుమతి ఇవ్వకుంటే నిర్ణీత గడువు తర్వాత న్యాయపోరాటం చేయాలని తీర్మానించారు. అన్నివిధాలా చట్ట నిబంధనల మేరకు ప్లాట్లకు రిజిస్ట్రేషన్ జరిగిందని వీటికి ప్లాన్లు అనుమతి పొందేందుకు మూకుమ్మడిగా దరఖాస్తులు చేయాలని నిర్ణయించారు. ప్లాట్ల లేఔట్‌లో సొసైటీ నిధులతో మౌలిక వసతులను కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని కార్యదర్శి రాజేంద్రప్రసాద్‌రెడ్డి చెప్పారు. తాను అవినీతి, అక్రమాలకు పాల్పడలేదని చెబుతూ కార్యదర్శిగా బాధ్యతల నుంచి తప్పుకుంటానని. ఇదే నా చివరి సమావేశమని అన్నారు. కాగా సమావేశానికి సభ్యులు హాజరుకాకపోవడం చర్చనీయాంశమైంది.

రాజకీయాల్లోకి మమ్మల్ని లాగొద్దు

పుత్తాకు తయ్యిబ్ ముస్లిం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఖాదర్‌బాషా



మాట్లాడుతున్న ఎస్. ఖాదర్‌బాషా

కడప కార్పొరేషన్: స్వార్థ రాజకీయాల కోసం తయ్యిబ్ ముస్లిం పాలిటెక్నిక్ కళాశాల పేరును వాడుకోవడం కమలాపురం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డికి తగదని కళాశాల, తయ్యిబ్ ముస్లిం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఎస్. ఖాదర్‌బాషా అన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్‌తో కలిసి సొసైటీ సభ్యులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాదర్‌బాషా మాట్లాడుతూ 2003 నుంచి తాను సొసైటీకి అధ్యక్షుడిగా ఉన్నానని, కళాశాలలో అడ్మిషన్లు, నిర్వహణ, పరీక్షలు అన్నీ తామే నిర్వహిస్తున్నామన్నారు. కళాశాల అభివృద్ధి కోసం సొసైటీకి సంబంధించిన భూమిని విక్రయించాలని కమిటీ నిర్ణయించిందన్నారు. ఈ మేరకు మొదట బీవీ సుధీర్‌కు విక్రయించామని, ఆయన అడ్వాన్స్ ఇచ్చి మిగిలిన మొత్తం ఇవ్వకపోవడంతో తామే వెళ్లి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డిని కొనుగోలు చేయాలని కోరామన్నారు. ఎకరా రూ.90 వేల చొప్పున 24 ఎకరాలు కొనేందుకు ఆయన ఒప్పుకున్నారన్నారు. కొందరు తమను బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు గుంజేందుకు ప్రయత్నించారని, అందుకు తాము లొంగకపోవడంతో దొంగ డాక్యుమెంట్లు సృష్టించి కోర్టుకు వెళ్లారన్నారు. కోర్టు తమకే అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. స్థల వివాదం కోర్టుకు వెళ్లడంతో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి వివాదాలున్న భూమిని తాను కొనుగోలు చేయనని, కేసు తేలిన తర్వాతే కొంటానని తేల్చి చెప్పారన్నారు. ఈలోపు తాను అడ్వాన్స్‌గా ఇచ్చిన డబ్బు వడ్డీతో సహా తిరిగి ఇవ్వాలని కోరారన్నారు. కాగా పుత్తా నరసింహారెడ్డి వాస్తవాలు విస్మరించి ఎమ్మెల్యే భూములు కొనుగోలు చేసినట్లు మాట్లాడటం దారుణమన్నారు. ముస్లిం మైనార్టీల గురించి, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి గురించి మాట్లాడే నైతిక హక్కు పుత్తా నరసింహారెడ్డికి లేదన్నారు. ఆయన రాజకీయాల కోసం కళాశాలను పేరు ప్రఖ్యాతులను మంటగలపడం అన్యాయమన్నారు. తమ సొసైటీ గురించి తప్పుగా మాట్లాడితే అంగీకరించే ప్రసక్తే లేదన్నారు. దీనిపై ఆధారాలతో సహా ఎక్కడైనా చర్చించేందుకు తాము సిద్ధమన్నారు. ఇకపై మాట్లాడే ముందు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. సొసైటీ ఉపాధ్యక్షుడు ముక్తియార్ అహ్మద్, జాయింట్ సెక్రటరీ నిసార్ అహ్మద్, ఇంతియాజ్‌బాషా, మన్సూర్ పాల్గొన్నారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు





సెమీఫైనల్లో తలపడుతున్న శ్రీకాకుళం – విజయనగరం జిల్లాల బాలుర జట్లు, గుంటూరు – ప్రకాశం జిల్లాల బాలికల జట్లు

ఫైనల్‌కు చేరుకున్న గుంటూరు, విజయనగరం జట్లు

మైదుకూరు : వైఎస్సార్ జిల్లా మైదుకూరులో రాష్ట్రస్థాయి అండర్–17 వాలీబాల్ పోటీలు హోరాహోరీగా జరగుతున్నాయి. బాలికల విభాగంలో గుంటూరు, బాలుర విభాగంలో విజయనగరం జిల్లా జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఆదివారం జరిగిన బాలికల విభాగం మొదటి సెమీఫైనల్ మ్యాచ్‌లో గుంటూరు – ప్రకాశం జిల్లాలు తలపడగా ప్రకాశం జిల్లాను ఓడించి గుంటూరు ఫైనల్‌కు చేరింది. బాలుర విభాగంలో శ్రీకాకుళం – విజయనగరం జిల్లాల మధ్య మొదటి సెమీ ఫైనల్ పోరు జరిగింది. ఈ మ్యాచ్‌లో విజయనగరం శ్రీకాకుళం జిల్లాను ఓడించి ఫైనల్‌కు చేరుకుంది. సోమవారం బాలికల విభాగంలో చిత్తూరు – కడప జిల్లాల మధ్య రెండో సెమీ ఫైనల్ మ్యాచ్ జరుగనుంది. ఈ మ్యాచ్‌లో విజేత ఫైనల్లో గుంటూరు జిల్లాతో తలపడనుంది. అదే విధంగా బాలుర విభాగంలో పశ్చిమ గోదావరి – అనంతపురం జిల్లాల మధ్య రెండో సెమీ ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఫైనల్‌లో విజయనగరం జిల్లాతో ఆడనుంది.

క్రీడాస్ఫూర్తితో ఆడాలి: గెలుపోటములతో సంబంధం లేకుండా క్రీడాస్ఫూర్తితో ఆడాలని వైఎస్సార్ జిల్లాకు చెందిన సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు, వాలీబాల్ ఎక్స్‌పర్ట్ షామీర్ బాషా అన్నారు. ఆదివారం ఆయన క్రీడాకారులతో మాట్లాడారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి తర్వాత దేశానికి ప్రాతినిధ్యం వహించి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. అనంతరం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల కార్యనిర్వాహక కార్యదర్శులు అరుణకుమారి, వసంత, మేధా డిఫెన్స్ అకాడమీ చైర్మన్ నరసింహులు షామీర్‌బాషాను సత్కరించారు.

వంతెన పనులు చకచకా

- గత ఏడాది డిసెంబర్ 23న సీఎం శంకుస్థాపన
- 1.81 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణం



నిర్మాణంలో వున్న పాపాఘ్ని నదిపై హైలెవెల్ వంతెన



భారీ క్రేన్‌ల సహాయంతో గడ్డర్ల ఏర్పాటు

వల్లూరు: కడప – అనంతపురం ప్రధాన రహదారిపై వల్లూరు– కమలాపురం మండలాల సరిహద్దున పాపాఘ్ని నదిపై నూతనంగా నిర్మిస్తున్న హైలెవెల్ వంతెన నిర్మాణ పనులు చకచకా సాగుతున్నాయి. భారీ వర్షాల కారణంగా పాపాఘ్ని నదికి వచ్చిన భారీ వరదల నేపథ్యంలో 2021 నవంబర్ 20వ తేదీన ఈ నదిపై ఉన్న హైలెవెల్ వంతెనలో కొంత భాగం కుంగిపోయి 21 వ తేదీన కూలి పోయింది. దీంతో ఈ రహదారిలో రాక పోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానిక శాసన సభ్యుడు పీ రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి ప్రజలు పడుతున్న కష్టాలను పరిశీలించారు. ప్రజలు పడుతున్న కష్టాల గురించి నేషనల్ హైవే అథారిటీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లారు. దీంతో మొదట పూర్తి స్థాయిలో వాహనాల రాక పోకలకు సాగించడానికి డైవర్షన్ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. రాత్రి సమయాల్లో సైతం పనులను చేపట్టి డైవర్షన్ రోడ్డు పనులను తక్కువ కాల వ్యవధిలో పనలు పూర్తి చేశారు..
- అనంతరం ఇక్కో వెంట్ 25 మీటర్ల వెడల్పు, 14 మీటర్ల పొడవుతో 26 వెంట్‌లను 650 మీటర్ల వంతెనతో కలిపి మొత్తం 1.81 కిలో మీటర్ల మేర రోడ్డును నిర్మించడానికి నేషనల్ హైవే అధికారులు చర్యలు చేపట్టారు. నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ పూర్తి చేశారు. టెండర్లు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ఆర్ఆర్ఆర్ ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ వారు టెండర్లలో హైలెవెల్ వంతెన నిర్మాణ పనులను 54 కోట్లకు దక్కించుకున్నారు. గత ఏడాది డిసెంబర్ 23వ తేదీన కమలాపురం పర్యటనకు వచ్చిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పలు అభివృద్ధి పనులతో బాటు ఈ హైలెవెల్ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.
- అనంతరం సాయిల్ టెస్టులను నిర్వహించి పనులను ప్రారంభించారు. నేషనల్ హైవే అధికారుల పర్యవేక్షణలో పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇప్పటి వరకు 27 పియర్స్ (పిల్లర్లు) ఫౌండేషన్లలో 26 పూర్తయ్యాయి. 22 పూర్తి స్థాయిలో పూర్తయ్యాయి. మొత్తం 104 గడ్డర్లు (భారీ భీమ్‌లు) అవసరం కాగా సమీపంలోని ఖాళీ స్థలంలో ఇప్పటికే 100 గడ్డర్లను తయారు చేశారు. కొద్ది రోజులుగా నదిలో నీరు ప్రవహిస్తున్న తరుణంలో పనులను నిలపకుండా కొనసాగించడానికి చర్యలు చేపట్టారు. బుదవారం నుంచి భారీ క్రేన్ల సహాయంతో గడ్డర్లను పియర్స్ పైకి ఎత్తి అమర్చే పనులు చేపట్టారు. వీలైనంత త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావడానికి చర్యలు చేపట్టారు.
- నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న సమయంలో ప్రస్తుతం ఉన్న డైవర్షన్ రోడ్డుపై రాక పోకలు స్తంభించిపోతున్నాయి. ఈ వంతెన పూర్తయితే జిల్లాలోని ఎర్రగుంట్ల, నల్లింగాయపల్లె, చిలంకూరు, అనంతపురం జిల్లాలోని తాడిపత్రి తదితర ప్రాంతాల్లో ఉన్న భారీ సిమెంట్ పరిశ్రమల నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు సిమెంట్, ఇతర ముడి పదార్థాలను తీసుకురావడానికి ఇబ్బందులు తొలగుతాయి. ఆర్టీపీపీ నుంచి ఫ్లైయాష్‌ను ఇతర ప్రాంతాల్లోని వివిధ పరిశ్రమలకు తరలించడానికి, అనంతపురం జిల్లాలోని రాయదుర్గం, కళ్యాణదుర్గం, హిందూపురం అనంతపురం, తాడిపత్రి పట్టణాల నుంచి, కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారికి ప్రజా రవాణాతో బాటు సరుకుల రవాణాకు సంభందించి సమస్యలు తొలగుతాయి.

చిన్న తరహా పరిశ్రమలతోనే ఆర్థికాభివృద్ధి



స్వయం సహాయ సంఘాల మహిళా సభ్యులతో ర్యాలీ నిర్వహిస్తున్న నాగరాజు

లక్కిరెడ్డిపల్లి: చిన్న తరహా పరిశ్రమలతోనే మహిళలు ఆర్థికాభివృద్ధి చెందవచ్చని అన్నమయ్య జిల్లా పరిశ్రమలశాఖ అధికారి నాగరాజు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంకల్ప సప్తహ కార్యక్రమంలో భాగంగా ఆదివారం లక్కిరెడ్డిపల్లిలో స్వయం సహాయ సంఘాల మహిళా సభ్యులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలతో చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని కుటుంబ పోషణతో పాటు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చాన్నారు. ప్లాస్టిక్ బాక్సులు, ప్లాస్టిక్ ప్లేట్లు, ట్రేలు, ఆయిల్, పెయింటింగ్, వివిధ రకాలైన వస్తువుల తయారీకి సంబంధించినవి పెట్టుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పర్యాటకశాఖ అధికారి నాగభూషణం, ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, ఎస్‌బీఐ మేనేజర్ చంద్రశేఖర్, వెలుగు ఏపీఎం నిరంజన్, ఎస్‌బీఐ కౌన్సిలర్ పవన్ కుమార్, సీసీలు రెడ్డిబాబు, సుబ్బరాయుడు, రాజన్న, ఉప సర్పంచ్ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కారు సహా అక్రమ మద్యం స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న కారు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కర్ణాటక రాష్ట్రం సరిహద్దుకు కూతవేటు దూరంలోని సంపతికోట క్రాస్ వద్ద ఎస్ఐ రవీంద్రబాబు సిబ్బందితో కలసి శనివారం రాత్రి వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో కర్ణాటక రాష్ట్రం నుంచి సంపతికోట క్రాస్ వైపు వస్తున్న కారును పోలీసులు ఆపగా.. డ్రైవర్ వదిలి పరారయ్యాడు. కారును పరిశీలించగా 12 బాక్సుల కర్ణాటక మద్యం ఉంది. దీంతో కారు, మద్యంను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ మద్యం విలువ రూ.33 వేలు ఉంటుందని ఎస్ఐ తెలిపారు. పరారైన డ్రైవర్ కోసం గాలింపు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



కురబలకోట : మండలంలోని ముదివేడు సచివాలయం వద్ద ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. వృద్ధాప్యం, అనారోగ్యం లేదంటే నిస్సహాయ స్థితిలో మృతి చెంది ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. ఆయన ఆచూకీ కోసం పోలీసులు ఆరా తీస్తున్నారు. ఎవరైనా గుర్తిస్తే సమాచారం ఇవ్వాలని వారు కోరారు.

విద్యుత్ షాక్‌తో..

రాయచోటి టౌన్ : కరెంటు తీగలు కాటేశాయి. దీంతో జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మృతి చెందారు. రాయచోటి రూరల్ పరిధిలోని గొర్లమొదివీడు గ్రామం బాలిరెడ్డిగారిపల్లెలో విద్యుత్ షాక్‌తో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బాలిరెడ్డిగారిపల్లెకు చెందిన ఆంజనేయులు వేరుశనగ పంట సాగు చేశాడు. ఈ పంటపై కోతులు దాడి చేస్తుండటంతో.. పొలం చుట్టూ విద్యుత్ తీగలు ఏర్పాటు చేశాడు. వాటిని గమనించని అదే గ్రామానికి చెందిన చిన్నకృష్ణ (60) గత నెల 29వ తేదీన పొరపాటున తగిలి షాక్‌కు గురై మృతి చెందాడు. పొలం వద్దకు వెళ్లిన ఆంజనేయులు చేసిన నేరం నుంచి తప్పించుకొనేందుకు మృతదేహాన్ని భార్గవ్, శ్రీనివాసులుతో కలిసి సమీపాన ఉన్న గుట్టల్లోని ముళ్ల పొదల్లో దాచిపెట్టారు. తమకేమీ తెలియనట్లు గమ్మునవున్నారు. కొందరు గ్రామస్తులు మృతదేహాన్ని గుర్తించి.. గ్రామంలో చెప్పడంతో విషయం గుట్టురట్టు అయ్యింది. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు అర్బన్ సీఐ తెలిపారు.

బతుకుదెరువు కోసం వచ్చి..

పీలేరు రూరల్ : విద్యుదాఘాతంతో బీహార్‌కు చెందిన తాపీ మేస్త్రీ మృతి చెందిన సంఘటన ఆదివారం పీలేరు పట్టణం కోటపల్లెలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా వున్నాయి. బీహార్ రాష్ట్రం మదేపురా జిల్లా అఖరి గ్రామానికి చెందిన ఎం.డి. అన్వర్ (30) బతుకుదెరువు కోసం ఏడు నెలల క్రితం మరి కొంత మందితో కలిసి పీలేరుకు వచ్చారు. ఓ మేస్త్రీ వద్ద తాపీ మేస్త్రీగా కూలి పని చేస్తున్నాడు. ఈ క్రమంలో కోటపల్లెలో ఓ ఇంటి వెలివేషన్ పనులు చేస్తుండగా.. పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్‌కు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు.

రెచ్చిపోతున్న మట్టి మాఫియా

- గుట్టలను మాయం చేస్తోంది
- అక్రమంగా తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు
- రిజర్వ్ ఫారెస్ట్‌ను వదలని అక్రమార్కులు

రాయచోటి : జిల్లాలో మట్టి మాఫియా ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఆరు ట్రాక్టర్లు, మూడు టిప్పర్లు అన్న చందంగా అక్రమదందా సాగుతోంది. రిజర్వ్ ఫారెస్ట్‌తోపాటు ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా తవ్వకాలు జరుపుతున్నారు. అధికారులు మాత్రం తమ దృష్టికి రాలేదన్న సాకులు చెబుతూ తప్పించుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. దీంతో మట్టి, రాళ్ల దందా కారణంగా గుట్టలకు గుట్టలు మాయం అవుతున్నాయి. అడవిలో వంట చెరుకు, ఇంటి అవసరాల కోసం చిన్న చెట్టును నరికినా.. కేసులు పెట్టే ఫారెస్ట్ అధికారులు రిజర్వ్ ఫారెస్ట్‌లో అక్రమ మట్టి తవ్వకాలు విచ్చలవిడిగా సాగుతున్నా చర్యలకు ఉపక్రమించకపోవడం గమనార్హం. రాయచోటి అటవీ రేంజ్ పరిధిలోని కేశాపురం బీట్ కలిబండ అటవీ ప్రాంతంలో మట్టి తవ్వకాలు సాగుతున్నాయి. చిన్నమండెం నుంచి పెద్దమండెం వెళ్లే రహదారిలో ఉన్న అటవీ ప్రాంతంలో జేసీబీలతో మట్టిని పెకలించి ట్రాక్టర్లు, టిప్పర్ల సాయంతో తరలించుకుపోతున్నారు. మాయమవుతున్న గుట్టలు, మట్టి తరలించిన ప్రాంతాల్లో ఏర్పడుతున్న గోతులను చూస్తే.. మట్టి మాఫియా ఆగడాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం అవుతుంది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కాంట్రాక్టర్లు ఎక్కువగా ఈ దందా కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఎటువంటి అనుమతులు తీసుకోకుండా ఈ మధ్య కాలంలోనే 200 టిప్పులు టిప్పర్లతో తరలించుకుపోయి



కలిబండ అటవీ ప్రాంతంలో మట్టి తవ్వకాల కారణంగా లోయగా మారిన దృశ్యం

నట్లు స్థానికులు చెబుతున్నారు. మట్టిని తరలించుకుపోయే టిప్పర్ల వేగంతో రహదారులు సైతం దెబ్బతిని ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. ఇదే పరిస్థితి రాయచోటి, మదనపల్లి, రాజంపేట పట్టణ సమీపాలలోని అటవీ భూముల్లో ఉంది. ప్రతి రోజు టిప్పర్లు ట్రాక్టర్ల సాయంతో మట్టిని తరలించుకుపోతున్నారు.

ప్రజా అవసరాలకు అడ్డుపడుతున్న అటవీ అధికారులు

అటవీ ప్రాంతాల నుంచి అత్యంత విలువైన ఎర్రచందనం, మట్టి సంపదను దోచుకెళ్తున్నా స్పందించని అటవీ అధికారులు.. ప్రజలకు ఉపయోగపడే రహదారుల ఏర్పాటులో అడ్డుపడుతున్న వైనంపై విమర్శల జోరు వినిపిస్తోంది. రాయచోటి–సుండుపల్లె, రాయచోటి–రాజంపేట ప్రధాన రహదారులు అటవీ ప్రాంత సమీపాల ద్వారా వెళ్తున్నాయి. ఈ రహదారులను రెండు లైన్లుగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసింది. ఈ రహదారుల విస్తరణ అటవీ భూములను ఆనుకొని చేపడుతున్నా.. ఆ శాఖ అధికారులు అడ్డుకోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రతి రోజు వందల వాహనాలు తిరిగే ఈ రహదారి అభివృద్ధికి సహకరించని అటవీ అధికారులు.. వారి పరిధిలోని విలువైన అటవీ సంపదను దోచుకెళ్తున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మట్టి తరలింపుపై పరిశీలిస్తాం : రేంజ్ ఆఫీసర్

కేశాపురం బీట్ పరిధిలోని కలిబండ అటవీ ప్రాంతంలో మట్టి మాఫియా అక్రమాలపై పరిశీలించి చర్యలు తీసుకుంటామని రాయచోటి రేంజ్ అధికారి స్ఫూర్తి చెప్పారు. కలిబండ ప్రాంతంలోని ఆ కొండ అటవీ ప్రాంతాల్లో ఎక్కడ మట్టిని తరలించినా చర్యలు చేపడతామని ఆయన చెప్పారు.

రసవత్తరంగా క్రికెట్ పోటీలు



మహేంద్రయాదవ్, కర్నూలు, (105 పరుగులు)



కేఎస్ఆర్ఎం మైదానంలో పోటీ పడుతున్న కడప, అనంతపురం జట్లు

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలో నిర్వహిస్తున్న అంతర్ జిల్లాల అండర్–23 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్ రసవత్తరంగా సాగుతోంది. నగరంలోని కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 485 పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో చిత్తూరు జట్టు రెండవ రోజు ఆదివారం బరిలోకి దిగింది. 99.4 ఓవర్ల వద్ద 9 వికెట్ల నష్టానికి 550 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. జట్టులోని ఆశిస్‌రెడ్డి 209 పరుగులు చేశాడు. కర్నూలు బౌలర్ సాత్విక్ 5 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 60.4 ఓవర్లలో 226 పరుగుల వద్ద ఆల్ అవుట్ అయ్యింది. జట్టులోని మహేంద్రయాదవ్ 105 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్లు మల్లేశన్ 5, సాయినాథ్ 3 వికెట్లు తీశారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 9 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 41 పరుగులు చేసింది. జట్టులోని శశాంక్ 19 పరుగులు చేశాడు. దీంతో రెండవ రోజు ఆట ముగిసింది.

కేఎస్ఆర్ఎం మైదానంలో..

కడప నగరంలోని కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 51 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో కడప జట్టు రెండవ రోజు ఆదివారం బరిలోకి దిగింది. 46.2 ఓవర్లలో 171 పరుగుల వద్ద ఆల్ అవుట్ అయింది. జట్టులోని వంశీకృష్ణ 52 పరుగులు చేశాడు. అనంతపురం జట్టు బౌలర్లు కమిల్ 4, మల్లికార్జున 3 వికెట్లు తీశారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 55 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 282 పరుగులు చేసింది. జట్టులోని అర్జున్ టెండల్కర్ 62, దత్తారెడ్డి 87 పరుగులు చేశారు. కడప బౌలర్ అస్లామ్ 3 వికెట్లు తీశాడు. దీంతో రెండవ రోజు ఆట ముగిసింది.

ఆ ఆందోళనలతో వీవోఏలకు సంబంధం లేదు

- వైఎస్ఆర్ క్రాంతి పథం యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మంజుల



సిద్దవటం : ఈ నెల 10వ తేదీ నుంచి వీవోఏల హక్కుల పేరుతో కొన్ని యూనియన్లు ధర్నా, వంట వార్పు కార్యక్రమాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈ కార్యక్రమాలతో వీవోఏలకు ఎలాంటి సబంధం లేదని ఏపీ వైఎస్ఆర్ క్రాంతి పథం యూనియన్ వైఎస్ఆర్ జిల్లా అధ్యక్షురాలు బోవిళ్ల మంజుల తెలిపారు. ఈ సందర్భంగా సిద్దవటంలో ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడారు. వీవోఏల కోసం ప్రభుత్వం అన్నీ రకాలుగా సహకరిస్తుందని, కొంత మంది వారి ఉనికిని కాపాడుకోవడం కోసం ఇలాంటి కార్యక్రమాలు చేస్తూ ప్రభుత్వానికి వీవోఏలను చెడ్డ చేస్తున్నారన్నారు. పక్క రాష్ట్రం తెలంగాణలో ఆ ప్రభుత్వం వీవోఏలకు రూ.5 వేలు గౌరవ వేతనం మాత్రమే ఇస్తోందన్నారు. జగనన్న ప్రభుత్వం మేనిఫెస్టోలో వీవోఏలకు గౌరవ వేతనం 2019లో పెంచుతామని చెప్పి రూ.8 వేలు పెంచిందన్నారు. మూడు నెలలకు ఒక్కసారి ఇచ్చే గౌరవ వేతనాన్ని ప్రభుత్వం ప్రతి నెల ఇస్తోందన్నారు. కొన్ని అంశాలపై వైఎస్ఆర్ క్రాంతి పథం యూనియన్ ప్రభుత్వంతో చర్చించి సానుకూల వాతావరణాన్ని కల్పించిందన్నారు. వీవోఏల ఉద్యోగ భద్రత, గౌరవ వేతనం పెంపు, రూ.10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం, మూడు సంవత్సరాల సర్కులర్ రద్దుపై ప్రభుత్వంతో సానుకూలంగా చర్చించడం జరుగుతుందన్నారు. వీవోఏలు ఎవరూ కూడా అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. కొంత మంది వారి మనుగడ కోసం వీవోఏలను బలి పశువులను చేయవద్దని హితువు పలికారు. ఈ ధర్నా, వంటా వార్పు కార్యక్రమాలలో వైఎస్ఆర్ జిల్లా వారు ఎవరూ పాల్గొనరని జిల్లా అధ్యక్షురాలు తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్య

తొండూరు : నియోజకవర్గంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. తొండూరు మండలం గోటూరు పంచాయతీ పరిధిలోని యాదవకుంట గ్రామానికి చెందిన ఏకాశి గంగయ్య (54) అనారోగ్యంతో ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన కొన్ని రోజులుగా ఆరోగ్యం సరిగా లేక బాధపడుతుండే వాడు. ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితులో ఊరి బయటికి వెళ్లి పొలాల్లో పురుగుల నివారణ మందు తాగి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆయనకు భార్య అనసూయ, కుమారుడు రెడ్డిరాజు, కుమార్తె లక్ష్మీప్రసన్న ఉన్నారు. ఏఎస్సై శ్రీనివాసులు కేసు నమోదు చేశారు.

కుటుంబ కలహాలతో..

లింగాల : మండలంలోని బోనాల గ్రామంలో కదిరి గాండ్ల గీత (28) అనే మహిళ శనివారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై రవికుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అనంతపురం జిల్లాలోని తాడిపత్రికి చెందిన రమేష్ టైలర్ వృత్తి చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అక్కడే గీత అనే మహిళను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. వీరు తాడిపత్రిలో నివాసముంటున్నారు. అయితే వారి మధ్య కుటుంబ కలహాలు ఏర్పడ్డాయి. దీంతో గీత.. రమేష్ అమ్మగారి ఊరైన బోనాల గ్రామానికి వచ్చి.. రమేష్ అవ్వ, తాతలతో విషయం తెలిపింది. అయితే రాత్రి 12 గంటల ప్రాంతంలో అందరూ నిద్రిస్తున్న సమయంలో కిరోసిన్ పోసుకుని నిప్పు అంటించుకుంది. వెంటనే గీత మృతదేహాన్ని పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. రమేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కురబలకోట మండలం పిచ్చలవాండ్లపల్లెకు చెందిన బొజ్జారెడ్డి కుమారుడు కె.సుధాకరరెడ్డి(20) కుటుంబ సమస్యలతో పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. తంబళ్లపల్లె మండలం ఎర్రబల్లికి చెందిన శేఖర్(40) కుటుంబ సమస్యలతో శనివారం అర్ధరాత్రి గన్నేరుపప్పు తిని ఆత్మహత్యకు యత్నించాడు.

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

- ప్రొద్దుటూరు బుకీలకు కౌన్సెలింగ్
- హోటళ్లు, లాడ్జీలను తనిఖీ చేసిన ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్



క్రికెట్ బుకీలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

కడప అర్బన్ : ఎవరైనా క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ అన్నారు. కడప నగరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లాడ్జీలలో ఆయన పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఐసీసీ క్రికెట్ ప్రపంచ కప్ 2023 నేపథ్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. రిజిస్టర్‌లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ బస చేసిన వారి వివరాలు ఆరా తీయాలని లాడ్జీ నిర్వాహకులకు తెలియజేశారు. అనుమానాస్పదంగా వుండే వ్యక్తులు ఎవరైనా వస్తే సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ వెంట కడప డీఎస్పీ ఎం.డి. షరీఫ్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ కె.అశోక్ రెడ్డి, కడప వన్‌టౌన్ సీఐ ఎన్.వి. నాగరాజు, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు సిబ్బంది ఉన్నారు.

బైండోవర్

ప్రొద్దుటూరు పట్టణంలోని 36 మంది క్రికెట్ బుకీలను జిల్లా ఎస్పీ ఎదుట పోలీస్ అధికారులు హాజరు పరిచారు. వారికి ఎస్పీ కౌన్సెలింగ్ నిర్వహించి, గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. అమాయక ప్రజలు, యువకులను లక్ష్యంగా చేసుకుని ఎక్కువగా డబ్బు సంపాదించవచ్చని ఆశలు రేకెత్తించేలా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తూ మోసం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో మెలగాలని, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. అనంతరం బుకీలను తహసీల్దార్ల వద్ద బైండోవర్ చేశారు.

పోలీసులకు సమాచారం ఇవ్వండి

జిల్లాలో ఎక్కడైనా క్రికెట్ బెట్టింగ్ జరుగుతున్నట్లు తెలిస్తే.. డయల్ 100కు సమాచారం ఇవ్వాలని జిల్లా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా వుంచుతామని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ వెంట ఫ్యాక్షన్ జోన్ డీఎస్పీ బాలస్వామిరెడ్డి, ప్రొద్దుటూరు వన్‌టౌన్ సీఐ రాజారెడ్డి, టూటౌన్ సీఐ ఇబ్రహీం, సిబ్బంది ఉన్నారు.

జిల్లా వ్యాప్తంగా తనిఖీలు

ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఏకకాలంలో లాడ్జీలు, హోటళ్లను పోలీస్ అధికారులు, సిబ్బంది తనిఖీ చేశారు. బెట్టింగ్‌కు పాల్పడుతున్న 15 మందిని అదుపులోకి తీసుకున్నారు. కడప నగరంలోని 68 హోటళ్లలో నలుగురిని, మైదుకూరులో 10 హోటళ్లలో ఇద్దరు, జమ్మలమడుగు పట్టణంలో 5 లాడ్జీలలో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే ప్రొద్దుటూరు పట్టణంలోని 35 లాడ్జీలలో తనిఖీలు చేసి ఏడుగురిని, పులివెందుల పట్టణంలో 12 లాడ్జిలలో తనిఖీలు నిర్వహించారు.

మాజీ సైనికుల సంక్షేమానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

కడప ఎడ్యుకేషన్ : మాజీ సైనికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం కడపలోని సీఎస్ఐ హైస్కూల్‌లో మాజీ కెప్టెన్లు జానకిరామ్, మనోహర్, ఎస్ఎస్ రాజు, చంద్రమోహన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి కడప, అన్నమయ్య జిల్లాల నుంచి నాయకులు, సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారి సమస్యలపై అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సైనిక్ ఆసుపత్రిలో జిల్లాలో ఎంపానల్‌మెంట్ ఆసుపత్రులు లేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దానికి ప్రైవేటు ఆసుపత్రులకు ట్రీట్మెంట్లకు ఇచ్చే మార్కెటింగ్ విలువ అతి తక్కువగా ఉండటం వలన ముందుకురావడం లేదన్నారు. దీనిపై సవరించి రేట్లు పెంచి ప్రోత్సహించాలన్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. అలాగే మిలటరీ క్యాంటిన్ నెలకు పది రోజులే జరపడం వల్ల దూరం నుంచి వచ్చిన వారికి తాము కోరుకున్నవి లభించక పోవడం జరుగుతుందన్నారు. ప్రతి నెల సైనిక్ క్యాంటిన్‌లలో కన్జూమర్స్ కమిటీ మీటింగ్, ఈసీహెచ్ఎస్‌లో కన్సోల్టెంట్ కమిటీ మీటింగ్, సైనిక్ సంక్షేమ కార్యాలయంలో అడ్వైజరీ కమిటీ మీటింగ్ వంటివి జరిపి వాటిపై సభ్యులకు అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ సింగ్, జనరల్ సెక్రటరీ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యానికి అమూల్య సేవలు



మూలె మల్లికార్జునరెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఖాజీపేట : తెలుగు సాహిత్య రంగానికి మూలె మల్లికార్జునరెడ్డి అమూల్యమైన సేవలు అందిస్తున్నారని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి తెలిపారు. తుడుములదిన్నె గ్రామంలో యోగివేమన యూనివర్సిటీ పాలక మండలి సభ్యుడు ఆచార్య మూలె మల్లికార్జునరెడ్డిని ఆదివారం ఘనంగా సన్మానించారు. తెలుగు సాహిత్యానికి ఆయన అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. తెలుగు సాహిత్యంలో అద్భుత రచనలు చేసి, తనకంటూ ప్రత్యేక స్థానం సాధించారని తెలిపారు. అలాంటి వ్యక్తి మన తుడుములదిన్నె వాసి కావడం సంతోషకరం అన్నారు. మొల్ల సాహితీ పీఠం అధ్యక్షుడు హనుమంతరావు మాట్లాడుతూ పుట్టిన ఊరికి మల్లికార్జునరెడ్డి మంచి పేరు తీసుకువచ్చారని అన్నారు. అనంతరం ఆచార్య మూలె మల్లికార్జునరెడ్డిని స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్ రెడ్డి, ఎంపీపీ అబుబకర్ సిద్ధిక్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా, తుడుములదిన్నె సర్పంచ్ కొత్తపల్లి కృష్ణారెడ్డి, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం సభ్యుడు డాక్టర్ తవ్వా వెంకటయ్య, ఈశ్వర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, బాల సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఫుట్‌బాల్ పోటీలు

మదనపల్లె సిటీ : మదనపల్లెలో 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అంతర్ జిల్లాల ఫుట్‌బాల్ అండర్–19 బాల,బాలికల పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. రెండో రోజు ఆదివారం జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానాల్లో పోటీలు జరిగాయి. బాలికల విభాగంలో అనంతపురం, వైజాగ్, వైఎస్సార్, గుంటూరు జిల్లాలు సెమీస్‌కు చేరాయి. బాలుర విభాగంలో క్వార్టర్ ఫైనల్స్‌కు కడప–కృష్ణ, గుంటూరు–వైజాగ్, కర్నూలు–చిత్తూరు, అనంతపురం– ప్రకాశం జట్లు పోటీపడనున్నాయి.

రోడ్డు ప్రమాదాల్లో 19 మందికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 19 మందికి గాయాలయ్యాయి. మండలంలోని తట్టివారిపల్లె పంచాయతీ వెంగమాంబసర్కిల్‌లో ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మదనపల్లె–1 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు తిరుపతికి వెళుతుండగా.. కదిరి నుంచి చిత్తూరుకు వెళుతున్న లారీ రింగ్‌రోడ్డు సర్కిల్‌లో ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులోని చెంబకూరు దళితవాడకు చెందిన డ్రైవర్ జి.రెడ్డెప్ప(47), తెట్టుగ్రామానికి చెందిన ప్రయాణికురాలు లలితమ్మ(40), వాల్మీకిపురానికి చెందిన ప్రయాణికుడు ఆదినారాయణ(45) గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మదనపల్లె తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టెంపో ఢీకొని..

ద్విచక్రవాహనాన్ని టెంపో ఢీకొన్న ఘటనలో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురం మండలం పైడిపాలెంకు చెందిన భార్యాభర్తలు బాలబ్రహ్మం (26), రేష్మా(18) ద్విచక్రవాహనంలో అన్నమయ్య జిల్లా మదనపల్లెకు వస్తుండగా.. బి.కొత్తకోట మండలం కనసానివారిపల్లె సమీపంలో టెంపో ఢీకొంది. ఈ ఘటనలో దంపతులు గాయపడ్డారు. గమనించిన స్థానికులు వారిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. బి.కొత్తకోట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి..

ద్విచక్రవాహనం అదుపు తప్పి బాలుడు గాయపడ్డాడు. మదనపల్లె పట్టణం జన్మభూమికాలనీకి చెందిన కార్తీక్ కుమారుడు అశోక్(16) ద్విచక్రవాహనంలో పట్టణంలోకి వస్తూ అదుపుతప్పి కిందపడి గాయపడ్డాడు. గమనించిన స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.



తీవ్రంగా గాయపడ్డ బాలబ్రహ్మం

ఆటోలు బోల్తా

మదనపల్లె : ముదివేడు– వెలిగల్లు మార్గంలోని కోటకొండ సమీపంలో ఆదివారం ఉదయం ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కోటకొండ వడ్డిపల్లెకు చెందిన మంగమ్మ(60), శేఖర్(22), దిలీప్(15) తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అదేవిధంగా రామసముద్రం మండలం మినికి గ్రామానికి చెందిన రమణ కుమారుడు ఏ.రవికుమార్(29) ఆటోలో మదనపల్లెకు వస్తుండగా, చెంబకూరు వద్ద బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రవికుమార్ తీవ్రంగా గాయపడగా, స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

బొలేరోను ఢీకొన్న లారీ

ములకలచెరువు : కోళ్ల లోడుతో వెళ్తున్న బొలేరో వాహనాన్ని పాల లారీ ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం రాత్రి మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెద్దపాళ్యంకు చెందిన షఫీవుల్లా (28), రసూల్ (27)లు కలిసి కోళ్ల లోడుతో బురకాయలకోటకు వస్తుండగా, ములకలచెరువు నుంచి మదనపల్లెకు వెళ్తున్న పాల లారీ తుమ్మణగుట్ట రైల్వేస్టేషన్ వద్ద ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బొలేరో వాహనంలో ఉన్న ఇద్దరికీ తీవ్ర గాయాలు అయ్యాయి. అటువైపు వెళ్లే ప్రయాణికులు 108 వాహనం ద్వారా మదనపల్లి ప్రభుత్వ జిల్లా హాస్పిటల్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హెల్మెట్ ధరించి.. ప్రాణాపాయం నుంచి బయటపడి..

పుల్లంపేట : మండల పరిధిలోని అనంతంపల్లి–చిన్నంపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఓబులవారిపల్లి మండలం ముదినేపల్లి గ్రామానికి చెందిన నంద్యాల శివ అనే యువకుడు బైక్‌పై వేగంగా వెళ్తూ.. ఎదురుగా వస్తున్న బస్సు, లారీని తప్పించబోయి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో శివ ఎడమకాలికి తీవ్ర గాయమైంది. స్థానికులు 108కి ఫోన్ చేసి రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. హెల్మెట్ ధరించడంతో ప్రాణాపాయం నుంచి శివ బయటపడ్డాడు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. చిన్నంపల్లి క్రాస్ రోడ్డు వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయని, కావున సంబంధిత అధికారులు స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

రెండు ఆటోలు ఢీ..

- ముగ్గురి పరిస్థితి విషమం
- సకాలంలో స్పందించిన సచివాలయ మహిళా పోలీస్







గాయపడ్డ నూర్‌మహమ్మద్, ప్రసాద్, డ్రైవర్ సమీవుల్లా

కురబలకోట : మండలంలోని అంగళ్లు వద్ద రెండు ఆటోలు ఢీకొన్న సంఘటనలో ఆరుగురు గాయపడ్డారు. ఇద్దరి ఆటో డ్రైవర్ల పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో తిరుపతి ఆసుపత్రికి రెఫర్ చేశారు. 108 వాహనంలో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసుల కథనం మేరకు.. కురబలకోటకు చెందిన ఆటో డ్రైవర్ షమీవుల్లా ఆటోలో అదే ఊరికి చెందిన రూబీన (30), వహీదా (50), 11 నెలల అర్శ, నూర్ మహమ్మద్ (27) మదనపల్లెలోని బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా అంగళ్లు వద్ద ఎదురుగా వచ్చిన బసినికొండకు చెందిన ప్రసాద్ ఆటో ప్రమాదవశాత్తు ఢీకొంది. ఈ ప్రమాదంలో వారు ఆరుగురు గాయపడ్డారు. ప్రమాదం జరిగిన సమయంలో అటుగా వస్తున్న కొత్తవారిపల్లె సచివాలయ మహిళా పోలీస్ సుమలత ప్రమాద సమాచారాన్ని ముదివేడు పోలీసులకు తెలిపింది. తనవంతు సాయంగా క్షతగాత్రులను ఆ మార్గంలో వస్తున్న కారును ఆపి మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించింది. చికిత్సల అనంతరం నూర్‌మహమ్మద్, ప్రసాద్, ఆటోడ్రైవర్ షమీవుల్లా పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు.